Happy Work Anniversary. 1 St Year

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

Good for Health

Best for Readers THE POWER OF PEN

సంపుటి : 2 సంచిక : 253 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 17 జూలై 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 253 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 17 July 2025 PAGES : 8 PRICE : 3/-

## జగన్.. మీ రాజకీయ జీవితంలో ఇదో బ్లాక్ మార్క్: సోమిరెడ్డి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 18)

జగన్‌రెడ్డీ.. ఎందుకంత అహంకారమని తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రశ్నించారు. ఈమేరకు ఆయన సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. లక్షల మంది ప్రాణాలర్పించి స్వాతంత్ర్యం సాధించిన రోజు గుర్తు లేదా? అని నిలదీశారు. "జగన్.. మీరు ఒక పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం విషయమైనా గుర్తుందా? పులివెందుల ఫలితంతో అసహనంగా ఉంటే మాత్రం జాతీయ పండగ మరిచిపోతారా? మీ రాజకీయ జీవితంలో ఇదో బ్లాక్ మార్క్" అని సోమిరెడ్డి మండిపడ్డారు.

## తెలుగు రాష్ట్రాల్లో కృష్ణాష్టమి సందడి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 18)

తెలుగు రాష్ట్రాల్లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గోపాలుడి ఆలయాలకు భక్తులు పోటెత్తి పూజలు చేస్తున్నారు. చిన్ని కృష్ణుడి వేషధారణలో అబ్బాయిలు, గోపికల వేషంలో అమ్మాయిల అలంకరణలు ఆకట్టుకున్నాయి. చిన్నారుల దగ్గర నుంచి పెద్దల వరకు అందరూ ఉట్టికొట్టి సంబరాలు చేసుకుంటున్నారు.

## సుప్రీం, హైకోర్టులు రెండూ సమానమే

ఉన్నతన్యాయస్థానం కొలీజియంను ఆదేశించజాలం

సీజేఐ గవాయ్ స్పష్టీకరణ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 18)

సుప్రీం కోర్టు, హైకోర్టులు ర్యాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైనవేనని రెండూ సమానమైన ప్రాధాన్యం కలిగి ఉంటాయని ఏ ఒక్కటీ మరోకదానికంటే ఉన్నతమైనది కాదని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. న్యాయమూర్తి పదవికి నిర్దిష్ట వ్యక్తి పేరును సిఫారసు చేయాలంటూ హైకోర్టును సుప్రీం ఆదేశించలేదని స్పష్టం చేశారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) నిర్వహించిన కార్యక్రమంలో సీజేఐ జస్టిస్ గవాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులను, హైకోర్టు న్యాయమూర్తుల పదవి కోసం పరిగణించాలని ఎస్‌సీబీఏ అధ్యక్షుడు వికాస్ సింగ్.. సీజేఐ జస్టిస్ గవాయ్ ముందు ఓ కీలక ప్రతిపాదనను చేశారు.

దీనిపై స్పందించిన జస్టిస్ గవాయ్.."ఫలానా వ్యక్తి పేరును న్యాయమూర్తి పదవికి సిఫార్సు చేయమని హైకోర్టు కొలీజియంను సుప్రీంకోర్టు ఆదేశించలేదు. ఎందుకంటే, రాజ్యాంగం ప్రకారం, సుప్రీంకోర్టు, హైకోర్టు కంటే ఉన్నతమైన న్యాయస్థానం కాదు. అలా అని తక్కువ కూడా కాదు. అందువల్ల న్యాయమూర్తుల నియామకంపై హైకోర్టు కొలీజియమే మొదటగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. వారు సిఫార్సు చేసిన పేర్లనే మేము పరిగణిస్తాం. అందులో సరైన అర్హత కలిగిన వారి పేర్లను సూచించమని చెబుతాం. వారు అన్నీ -మిగతా 2లో

## అధర్మం ఎంత బలంగా ఉన్నా అది తాత్కాలికమే: జగన్

ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపిన జగన్

ధర్మం నెమ్మదిగా ముందుకెళ్లినా అది శాశ్వతమని వ్యాఖ్య

శ్రీకృష్ణుని జీవితం దీనికి నిదర్శనమని ట్వీట్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 18)

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా వైసీపీ అధినేత జగన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికర ట్వీట్ చేశారు. అధర్మం ఎంత బలంగా ఉన్నా అది తాత్కాలికమని ఆయన పేర్కొన్నారు. ధర్మం ఎంత నెమ్మదిగా ముందుకెళ్లినా అది శాశ్వతం అని చెప్పారు. శ్రీకృష్ణుని జీవితం దీనికి నిదర్శనమని అన్నారు. ఈ కృష్ణాష్టమి మీకు శాంతిని, ప్రేమను, విజయాన్ని తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

# 'స్త్రీ శక్తి' పథకంపై నారా లోకేశ్ ఆసక్తికర ట్వీట్

- 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'స్త్రీ శక్తి' పథకం ప్రారంభం
- సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత బస్సు పథకాన్ని అమలు చేసిన కూటమి ప్రభుత్వం
- ఇది మహిళల స్వేచ్ఛకు, గౌరవానికి ప్రతీక అన్న నారా లోకేశ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 18)

రాష్ట్రంలోని మహిళలకు కానుకగా కూటమి ప్రభుత్వం 'స్త్రీ శక్తి' పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది.తాజాగా రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... సూపర్ సిక్స్ హామీలలో ఒకటైన ఈ పథకాన్ని ప్రారంభించడం గర్వంగా ఉందని తన పోస్టులో పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం కేవలం ఒక సౌకర్యం మాత్రమే కాదని, అది వారి స్వేచ్ఛకు, గౌరవానికి, ప్రభుత్వంపై వారికున్న నమ్మకానికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.

"ఈ ఉచిత బస్సు టికెట్ మహిళల సాధికారతకు ప్రతీక. ఇది కేవలం ప్రయాణం కాదు, సమాన అవకాశాల దిశగా వేస్తున్న ఒక ముందడుగు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళా సాధికారతకు మా ప్రభుత్వం -మిగతా 2లో

## ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు.. అదే ఉత్తమ మార్గం: ట్రంప్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 18)

ఉక్రెయిన్ యుద్ధానికి తెరదించే ప్రయత్నాల్లో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్ లు అలాస్కా వేదికగా భేటీ అయిన విషయం తెలిసిందే. ఎలాంటి ఒప్పందం కుదరనప్పటికీ.. చర్చలు సానుకూలంగా సాగినట్లు ఇరునేతలు ప్రకటించారు. ఈ క్రమంలోనే 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఉక్రెయిన్, రష్యాలు నేరుగా శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకోవడమే ఈ యుద్ధాన్ని ముగించేందుకు ఉత్తమ మార్గంగా పేర్కొన్నారు. కాల్పుల విరమణ నిలబడే అవకాశాలు తక్కువేనన్నారు. అదేవిధంగా జెలెన్‌స్కీ అమెరికా పర్యటనను ధ్రువీకరించారు.

"అలాస్కాలో ఇదొక గొప్ప, విజయవంతమైన రోజు. రష్యా అధ్యక్షుడు పుతిన్ తో సమావేశం చాలా బాగా జరిగింది. అదేవిధంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, నాటో సెక్రటరీ జనరల్, ఇతర ఐరోపా నేతలతో ఫోన్‌లో వేర్వేరుగా మాట్లాడాను. నేరుగా శాంతి ఒప్పందానికి వెళ్లడమే యుద్ధాన్ని ముగించేందుకు ఉత్తమ మార్గంగా ఓ నిర్ణయానికి వచ్చాం. కాల్పుల విరమణ తరచూ ఉల్లంఘనలకు గురయ్యే అవకాశం ఉంది. జెలెన్‌స్కీ సోమవారం ఓవల్ కార్యాలయానికి రానున్నారు.

## పీ4 విధానంలో అన్ని పాఠశాలల అభివృద్ధి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 18)

నెల్లూరు నగరంలోని 15 ఉన్నత పాఠశాలలను వీఆర్ హైస్కూల్ తరహాలోనే అభివృద్ధి చేస్తామని మంత్రి నారాయణ అన్నారు. శనివారం నగరంలోని పలు ఉన్నత పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపల్ పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక



దృష్టి పెట్టామన్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికి నగరంలోని 15 స్కూళ్లను అన్ని హంగులతో పూర్తిస్థాయిలో తీర్చిదిద్దుతామని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పీ4 విధానంలో అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత బడులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని వివరించారు.

"కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానం అనుసరించి నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే ప్రదేశంలో స్కూల్స్ ఉండే విధంగా చర్యలు చేపడతాం. ఇందుకోసం ప్రతి పాఠశాలలో 40 గదులు అవసరం. త్వరలోనే అంచనాలు తయారు చేయించమని అధికారులను ఆదేశించాం. స్త్రీ శక్తి -మిగతా 2లో

## శ్రీకృష్ణుడు చూపిన బాటలో ప్రతిఒక్కరూ నడవాలి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 18)

శ్రీకృష్ణుడు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇవాళ దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకు శ్రీకృష్ణుడు అవతరించిన పర్వదినమని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ తమ జీవితాన్ని ఆనందంగా తీర్చిదిద్దుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

మరోవైపు మాజీ ప్రధాని వాజ్‌పేయీ వర్ధంతి సందర్భంగా లోకేశ్ ఘన నివాళులర్పించారు. నమ్మిన సిద్ధాంతాల కోసం చివరి వరకు కట్టుబడిన వ్యక్తి వాజ్‌పేయీ అని కొనియాడారు. కష్టాలను ఓర్పుతో భరిస్తూ అద్భుతమైన దార్శనికత ప్రదర్శించారన్నారు. " ఆర్థిక, మౌలిక సంస్కరణలతో దేశ రూపురేఖలు మార్చారు. తనదైన ప్రసంగాలతో అందర్నీ మంత్రముగ్ధుల్ని చేసేవారు. ప్రధానిగా దేశానికి ఆయన చేసిన సేవలు స్మరించుకుందాం." అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

## ఉచిత ప్రయాణం పేరుతో మహిళలను దారుణంగా మోసం చేశారు

16 రకాల బస్సుల్లో కేవలం 5 రకాల బస్సుల్లో మాత్రమే

ఉచిత ప్రయాణం అని కల్యాణి మండిపాటు

తిరుపతి, శ్రీకాళహస్తి వంటి పుణ్యక్షేత్రాలకు పథకం వర్తించదని వెల్లడి

మీ మేనత్తలకు చంద్రబాబు ఎప్పుడైనా రాఖీ కట్టారా అని లోకేశ్‌కు సూటి ప్రశ్న



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 18)

ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంపై వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కల్యాణి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ పథకం పేరుతో -మిగతా 2లో

## ట్రంప్- పుతిన్ ప్రయత్నాలు భేష్..: భారత్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 18)

ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే ప్రయత్నాల్లో భాగంగా అలాస్కా వేదికగా అమెరికా, రష్యా అధ్యక్షుల మధ్య జరిగిన సమావేశాన్ని భారత్ స్వాగతించింది. ఈ భేటీలో భాగంగా సాధించిన పురోగతిని అభినందిస్తున్నట్లు పేర్కొంది. భారత విదేశాంగశాఖ ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

"అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , రష్యా అధినేత పుతిన్‌ల మధ్య అలాస్కాలో జరిగిన సమావేశాన్ని స్వాగతిస్తున్నాం. శాంతి సాధన దిశగా వారి ప్రయత్నాలు ఎంతో ప్రశంసనీయం. ఈ భేటీలో సాధించిన పురోగతిని అభినందిస్తున్నాం. చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే సమస్య పరిష్కారానికి ముందుకెళ్లాలి.



ఉక్రెయిన్ సంక్షోభానికి వీలైనంత త్వరగా తెరపడాలని ప్రపంచం కోరుకుంటోంది" అని విదేశాంగశాఖ తన ప్రకటనలో పేర్కొంది.

జెలెన్‌స్కీతో ట్రంప్ ఫోన్ కాల్.. సోమవారం మరో భేటీ

ట్రంప్, పుతిన్‌లు భేటీ అయ్యేందుకు ముందుకు రావడాన్ని కూడా భారత్ ఇటీవల స్వాగతించిన విషయం తెలిసిందే. -మిగతా 2లో

# సర్దార్‌గా ఖ్యాతి గడించిన గొప్ప నేత స్వర్గీయ సర్దార్ గౌతు లచ్చన్న





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 16)

సర్దార్ గా ఖ్యాతి గడించిన గొప్ప నేత సర్దార్ గౌతు లచ్చన్న అని బిసి కార్పొరేషన్ ఈడి జంపాణి రామచంద్రయ్య అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల పెన్నిధి, రైతు బాంధవుడు, కార్మిక శ్రేయోభిలాషి స్వర్గీయ సర్దార్ గౌతు లచ్చన్న 116 వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత సర్దార్ గౌతు లచ్చన్న చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వల్లభభాయ్ పటేల్ తరువాత స్వర్గీయ సర్దార్ గౌతు లచ్చన్న గౌరవం పొందిన ఏకైక వ్యక్తి అని అన్నారు. రైతుల సంక్షేమం కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంకితభావంతో ఎన్నో ఉద్యమాలు నడిపిన మహోన్నత నేత సర్దార్ గౌతు లచ్చన్న అని, గౌతు లచ్చన్న కార్యదక్షత, ఉక్కు సంకల్పం వల్లే ఆయనకు సర్దార్ అనే పేరు వచ్చిందన్నారు. ఉత్తరాంధ్ర నుంచి ఎగిసిపడ్డ రాజకీయ కెరటమని, తాను నమ్మిన సిద్ధాంతం కోసం పదవులను సైతం త్యాగం చేశారని పేర్కొన్నారు. తన రాజకీయ గురువు ఎన్ జి రంగా కోసం ఎంపీ పదవిని సైతం త్యాగం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ సిబ్బంది, బిసి వెల్ఫేర్ సిబ్బంది, గౌడ ప్రజా నాయకులు అయిన జంపాణి రామచంద్రయ్య, స్టేట్ గౌడ కార్పొరేషన్ డైరెక్టర్, అంజయ్య, రాఘవులు, పి చింతయ్య, ప్రజా నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా కృష్ణాష్టమి ఉత్సవాలు







(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 16)

కృష్ణాష్టమి సందర్భంగా పొదిలి నగర పంచాయతీ పరిధిలోని గోశాలలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని కృష్ణుడిని ఘనంగా ఆరాధించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, బెల్లంకొండ శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా పాల్గొని గోవులకు పచ్చి గ్రాసం పెట్టి, శ్రీకృష్ణుని పూజించారు. ఈ సందర్భంగా బెల్లంకొండ విజయలక్ష్మి మాట్లాడుతూ కృష్ణాష్టమి ఉత్సవాలకు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక విశిష్టత ఉంది. మన సంప్రదాయాలను కాపాడుతూ గోమాత సేవలో అందరూ ముందుకు రావాలి. పొదిలి గోశాల అభివృద్ధి చెందుతూ, సమాజానికి ఆదర్శంగా నిలుస్తోంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో గోశాల కమిటీ సభ్యులు ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. అలాగే బిజెపి టౌన్ అధ్యక్షుడు యుద్ధం మహేష్, శంకర్, నాగరాజు, సాహితి, చార్మి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## సుప్రీం, హైకోర్టులు రెండూ సమానమే

పరిశీలించి న్యాయమూర్తి పదవికి అర్హులైన వారి పేర్లను సుప్రీంకోర్టుకు పంపుతారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, తన హయాంలో సుప్రీంకోర్టు కొలీజియం అభ్యర్థులతో నేరుగా సంభాషించే పద్ధతిని ప్రారంభించారు. అది నిజంగా చాలా మంచి ఫలితాలను ఇచ్చింది. 10-15 నిమిషాలు లేదా అరగంట పాటు అభ్యర్థులతో సంభాషించిన తరువాత, వారిలో న్యాయమూర్తి పదవికి ఎవరు అర్హులో తెలుసుకోవడానికి, వారు సమాజానికి ఎంత మేరకు తోడ్పడతారో అంచనా వేయడానికి వీలవుతుంది" అని వ్యాఖ్యానించారు.

## 'స్త్రీ శక్తి' పథకంపై నారా లోకేశ్ ఆసక్తికర ట్వీట్

పట్టం కట్టింది" అని లోకేశ్ తెలిపారు. ఈ చారిత్రక సందర్భాన్ని ఒక వేడుకలా జరుపుకోవాలని ఆయన రాష్ట్రంలోని మహిళలకు పిలుపునిచ్చారు. ప్రయాణ సమయంలో తమ ఉచిత బస్సు టికెట్‌తో సెల్ఫీ దిగి, మహిళా సాధికారత అంటే ఏమిటో ప్రపంచానికి చాటిచెప్పాలని ఆయన కోరారు.

## ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు.. అదే ఉత్తమ మార్గం: ట్రంప్

అన్ని సవ్యంగా సాగితే.. పుతిన్‌తో సమావేశాన్ని షెడ్యూల్ చేస్తాం. తద్వారా లక్షలాది మంది ప్రజల ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుంది" అని ట్రంప్ రాసుకొచ్చారు.

దాదాపు ఐదేళ్ల విరామం అనంతరం ట్రంప్, పుతిన్‌ల మధ్య జరిగిన ఈ సమావేశాన్ని ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనించాయి. భేటీలో అనేక అంశాలు చర్చకు వచ్చాయని ట్రంప్ తెలిపారు. ఈ చర్చల్లో ఎంతో పురోగతి ఉందన్నారు. అయితే కొన్ని సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉందని వెల్లడించారు. తుది ఒప్పందం మాత్రం కుదరలేదన్నారు. అన్ని విషయాలను పరిష్కరించుకొని అధికారికంగా అగ్రిమెంట్‌పై సంతకం చేసే వరకు ఒప్పందం జరగదన్నారు. 2022లో తాను అధ్యక్షుడిగా ఉండి ఉంటే ఉక్రెయిన్ యుద్ధం జరిగేదే కాదని ట్రంప్ పదే పదే చేసిన వ్యాఖ్యలపై తాజా భేటీలో పుతిన్ స్పందించారు. ఆ విషయాన్ని ధ్రువీకరిస్తున్నట్లు చెప్పారు.

## పీ4 విధానంలో అన్ని పాఠశాలల అభివృద్ధి

పథకానికి మహిళల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. మహిళల ఆనందానికి హద్దులు లేవు. నెల్లూరు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం. నగర ప్రజలకు తాగునీటి సౌకర్యంతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీని త్వరలోనే పూర్తి చేస్తాం. కాలువలకు ఇరువైపులా గోడలు నిర్మించి, శ్లాబ్ సైతం ఏర్పాటు చేస్తాం" అని మంత్రి తెలిపారు.

## ట్రంప్- పుతిన్ ప్రయత్నాలు భేష్..: భారత్

"ఉక్రెయిన్ సంక్షోభానికి ముగింపు పలికేందుకు ఇదో అవకాశంగా భావిస్తున్నాం. ఇది యుద్ధాల కాలం కాదన్న ప్రధాని నరేంద్ర మోదీ సందేశానికి ఈ ప్రయత్నాలు దోహదం చేస్తాయి" అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఉచిత ప్రయాణం పేరుతో మహిళలను దారుణంగా మోసం చేశారు

కూటమి ప్రభుత్వం మహిళలను దారుణంగా మోసం చేసిందని, వారి ఆశలను బస్సు టైర్ల కింద తొక్కేసిందని ఆరోపించారు. మంత్రి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ ఆమె ఘాటుగా స్పందించారు.దుర్గమ్మ పాదాల చెంత చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ కలిసి మహిళలను వంచించారని ఆమె మండిపడ్డారు. రాష్ట్రంలో ఏపీఎస్ఆర్టీసీకి 16 రకాల బస్సులు ఉంటే కేవలం 5 రకాల బస్సుల్లో, అదీ కొన్ని ప్రాంతాలకే ఉచిత ప్రయాణాన్ని పరిమితం చేశారని విమర్శించారు. ఎన్నికల ముందు రాష్ట్రవ్యాప్తంగా అన్ని బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు శ్రావణ శుక్రవారం రోజున మహిళలను చీటింగ్ చేశారని అన్నారు. తిరుపతి, శ్రీకాళహస్తి, కాణిపాకం, అన్నవరం వంటి పుణ్యక్షేత్రాలకు ఈ పథకం వర్తించకపోవడంతో రెండున్నర కోట్ల మంది మహిళలను మోసం చేసినట్లేనని ఆమె పేర్కొన్నారు. లగేజీతో మహిళలు పది, పదిహేను బస్సులు మారుతూ తిరుపతి వెళ్లడం సాధ్యమేనా అని ఆమె ప్రశ్నించారు.

ముఖ్యమంత్రి అంటే 'చీటింగ్ మాస్టర్'గా మారిందని, కూటమి ప్రభుత్వం 'కోతల ప్రభుత్వం'గా తయారైందని వరుదు కల్యాణి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని అన్ని బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు.

అంతకుముందు లోకేశ్ చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలపైనా కల్యాణి తీవ్రంగా స్పందించారు. మహిళల గౌరవం గురించి మాట్లాడే అర్హత లోకేశ్‌కు ఉందా అని నిలదీశారు. "మీ మేనత్తలు ఎప్పుడైనా మీ నాన్నకు రాఖీ కట్టారా? మీ ఇంటి శుభకార్యాలకు వారిని పిలిచారా? హెరిటేజ్‌లో వారికి ఎంత వాటా ఇచ్చారు?" అని వరుస ప్రశ్నలు సంధించారు. పది కోట్లు ఖర్చు పెట్టి పవన్ కల్యాణ్ తల్లిని లోకేశ్ తిట్టించలేదా అని కూడా ఆమె ఆరోపించారు. చంద్రబాబు, పవన్, లోకేశ్ తమ ప్రత్యేక విమానాల ఖర్చులు తగ్గించుకుంటే రాష్ట్రంలోని మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం కల్పించవచ్చని వరుదు కల్యాణి సూచించారు.

# ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ ఫండ్ రూ.28.30 కోట్లు మంజూరు

### అత్యధికంగా ప్రకాశం జిల్లాకు రూ.6 కోట్లు
### కనిష్టంగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు రూ.7.85 లక్షలు
### మంత్రి స్వామికి అభినందనలు తెలిపిన దళిత నేత నీలం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 16)

చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ ఫండ్ ను దళిత నాయకుల డిమాండ్‌తో ఎట్టకేలకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి మంజూరు చేయించారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు అప్పటికప్పుడు రిలీఫ్ ఇచ్చి ఆదుకోవలసిన ప్రభుత్వాలు బాధితుల సహనాన్ని పరీక్షిస్తున్నాయన్నారు. ఎస్సీ ,ఎస్టీలు హత్యకు గురైన ఘటనలలో ప్రత్యేక పరిస్థితులలో 10 లక్షల రూపాయలు పరిహారం ఇవ్వాలని ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నిర్ణయం తీసుకున్న అమలు కావడం లేదన్నారు. గతంలో ఆయా జిల్లాలలో ట్రెజరీల ద్వారా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ రిలీఫ్ బిల్లులు మంజూరు అయ్యేవి గతంలో బ్యాంకు చెక్కులు ఇచ్చేవారు. కానీ ఈ విధానాన్ని స్వస్తి పలికి పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా అమరావతి కేంద్రంగా ఎస్సీ ఎస్టీ రిలీఫ్ బిల్లులు కూడా ఇవ్వాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చట్ట ప్రకారం ఎస్సీ ఎస్టీ కేసుల్లో రిలీఫ్ 51% కేంద్ర ప్రభుత్వం 49% రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా 100% నిధులు మంజూరు చేయాలి కానీ ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం నుంచి ఎస్సీ ఎస్టీ రిలీఫ్ ఫండ్స్ వచ్చినా కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను ఎస్సీ ఎస్టీ బాధితులకు ఇవ్వకుండా శాతం కూడా ఇవ్వకుండా దారిమల్లించి ప్రభుత్వ పథకాలైన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం లాంటి పథకాలకు వాడుకుంటుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీల హత్య జరిగితే తక్షణ సహాయంగా జిల్లా కలెక్టర్ ఒ క్క రూపాయి కూడా ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో తాము అనేకసార్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామిని కలిసి ఎస్సీ ఎస్టీ రిలీఫ్ ఫండ్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశామన్నారు. అలాగే సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ లావణ్య వేణి ని కలిసి కూడా రిలీఫ్ ఫండ్స్ పై ఫిర్యాదు చేశామన్నారు. ఎట్టకేలకు సుమారు ఎస్సీ ఎస్టీ రిలీఫ్ ఫండ్ 90 కోట్లు మంజూరు కావలసి ఉండగా 28 కోట్ల 30 లక్షల రూపాయలు రిలీఫ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి దళిత నాయకుల డిమాండ్ మేరకు మంజూరు చేయించారు. ఈ 28 కోట్ల 30 లక్షల రూపాయలు రాష్ట్రంలోని 26 జిల్లాలకు మంజూరు చేశారు. ఆయా జిల్లాల కలెక్టర్లు డైరెక్ట్ గా బాధితుల అకౌంట్లో ఈ రిలీఫ్ ఫండ్ ను జమచేయాలి రాష్ట్ర వ్యాప్తంగా మంజూరు అయిన ఈ రిలీఫ్ ఫండ్స్ లో అత్యధికం ప్రకాశం జిల్లాకు ఆరు కోట్ల రూపాయలు రెండవ స్థానంలో బాపట్ల జిల్లాకు రెండు కోట్ల 62లక్షల 60 వేలు మూడవ స్థానంలో గుంటూరు జిల్లా 2 కోట్ల 19 లక్షల 53 వేల 750 రూపాయలు మంజూరు అయినవి కనిష్టంగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు 7 లక్షల 80 వేలు తరువాత స్థానంలో అన్నమయ్య జిల్లాకు 25 లక్షల 57 వేలు మంజూరు అయ్యాయి. వీలైనంత త్వరగా ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలు కూడా మంజూరు చేయించాలని శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామిని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు.

# ఓట్ల దొంగతనం పై ఒంగోలులో రేపు కాంగ్రెస్ క్యాండిల్ ర్యాలీ

### – ఓట్లు దొంగ గద్దె దిగు – జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 16)




ఎన్నికల కమిషన్ బిజెపితో కుమ్మక్కై ఓట్ల దొంగతనానికి పాల్పడు తున్నందుకు నిరసనగా దేశవ్యాప్తంగా ఈనెల 18వ తేదీన క్యాండిల్ ర్యాలీ నిరసనల్లో భాగంగా ఒంగోలులో సోమవారం పెద్ద ఎత్తున జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా నేడు ఒంగోలులో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ బిజెపితో కలిసి ఒక బీహార్ రాష్ట్రంలోనే 65 లక్షల పైగా ఓట్లను తొలగించిందని, అలాగే దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ప్రతిపక్షాల ఓట్లను తొలగిస్తున్నారని ఆయన అన్నారు, ఒక్కొక్క పార్లమెంట్ స్థానంలో లక్ష ఓట్లకు పైగా పోలింగ్ అనంతరం డిజిటల్ ఓటర్ లిస్టులో చేరుస్తున్నారని ఒక్కొక్క అసెంబ్లీకి 25,000 వేలకు పైగా ఓట్లను చేర్చి బిజెపి గెలుపుకు దోహద పడుతున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. రాహుల్ గాంధీ వెలికి తీసిన ఈ అతిపెద్ద ఓట్ల కుంభకోణంపై ఎలక్షన్ కమిషన్ సమాధానం చెప్పలేక డొంక తిరుగుడుగా మాట్లాడుతుందని, చివరకు సుప్రీం కోర్ట్ మొట్టికాయలు వేసిన ఏం చెప్పలేని స్థితిలో ఉందని, ఓట్ల దొంగ మోడీ దిగిపొమ్మని ఈనెల 18 వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు ఒంగోలు మిరియాల పాలెం సెంటర్ లోగల అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి ట్రంక్ రోడ్ మీదగా బాపూజీ కాంప్లెక్స్ వద్దగల మహాత్మా గాంధీ విగ్రహ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సైదా తెలిపారు ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇదా సుధాకర్ రెడ్డి, రాష్ట్ర కేకేసి చైర్మన్ దర్శి నియోజకవర్గ ఇన్చార్జ్ కైపు కృష్ణారెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి, ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్చార్జ్ పాలపర్తి విజేష్ రాజ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ రసూల్, గోరంట్ల కోటేశ్వరరావు, తాతా శ్రీనివాసులు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మన్నం ప్రసన్న రాజు, జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షులు ఉంగరాల శీను, జిల్లా లీగల్సేల్ అధ్యక్షులు సుదర్శ రవి రాష్ట్ర మైనార్టీ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులు మహమ్మద్ రఫీ అహ్మద్, రాష్ట్ర కేకేసి కార్యదర్శి సుధీర్ వర్మ, ఈ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు ఇరిగినేని వెంకట నరసయ్య, షేక్ రవూఫ్, మధు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సంస్థ గత ఎన్నికల కంట్రోల్ బోర్డు చైర్మన్ బొద్దు సతీష్, జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి మహేష్, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, జిల్లా కంట్రోల్ బోర్డు సభ్యులు కృష్ణ బాబు, తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



## నేడు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నూతన భవనం ప్రారంభం

### ప్రారంభించనున్న వ్యవస్థాపకులు ఎన్ రామచంద్రారెడ్డి

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 16)**

ఆదివారం పట్టణంలోని స్థానిక ఎస్‌వికెపి డిగ్రీ కళాశాల ఎదురుగా నూతనంగా నిర్మించిన మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నూతన (తరువాయి 5లో...)

# కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ ను సూపర్ సక్సెస్ చేసింది

### కొండపి ఏఎంసి ఛైర్‌పర్సన్ ప్రమాణస్వీకార మహోత్సవంలో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి

### అట్టహాసంగా కొండపి ఏఎంసి ఛైర్‌పర్సన్ కర్ణ తిరుపతమ్మ ప్రమాణస్వీకారం

### పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు





**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఆగస్టు 16)**

కొండపి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. కొండపి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా కర్ణ కోటిరెడ్డి సతీమణి కర్ణ తిరుపతమ్మ ప్రమాణ స్వీకారం చేయగా, పాలకవర్గ సభ్యులు కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఏపి మారటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తముల అశోక్‌రెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్, చీరాల ఎమ్మెల్యే యం యం కొండయ్య, 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంక దినకర్, యర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు, తదితర కూటమి నేతలు పాల్గొన్నారు.

పాలక మండలి చైర్‌పర్సన్ తిరుపతమ్మతో పాటు సభ్యులను అభినందించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కూటమి ప్రభుత్వం సంకల్పంతో ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు.

**సూపర్ సిక్స్‌పై వైసీపీ అసత్య ప్రచారం**

ఈ సందర్భంగా ప్రసంగించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, వైసీపీ నేతలు, ముఖ్యంగా మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై అబద్ధపు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. "సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం లేదంటూ వారు చేస్తున్న ప్రచారం పూర్తిగా అబద్ధం. వాస్తవానికి రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీసిన పరిస్థితిలో కూటమి ప్రభుత్వం బాధ్యతాయుతంగా పనిచేసి సూపర్ సిక్స్‌ను సూపర్ సక్సెస్ చేసింది" అని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేర్చుతోంది. పింఛన్‌ను రూ. 4000కి పెంచాము. అన్నదాత సుఖీభవను విజయవంతంగా అమలు చేస్తున్నాం. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ జరుగుతోంది. తల్లికి వందనం పథకంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి ప్రయోజనం కల్పిస్తున్నాం. ఇంత అద్భుతమైన పథకాలను అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై (తరువాయి 4లో...)



## పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు

### మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఆగస్టు 16)**

ఇటీవల పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటిసి ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని కూటమి ప్రభుత్వం ఖూనీ చేసిందని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి అన్నా రాంబాబు విమర్శించారు. శనివారం ఆయన వైయస్సార్సీపి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలను సజావుగా నిర్వహించాల్సిన ఎలక్షన్ కమీషన్, పోలీసులు, పోలింగ్ సిబ్బంది అధికారపార్టీతో కుమ్మక్కవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్టే అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన వీడియో, ఫోటోల్లో సాక్షిగా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కమలాపురం ప్రాంతాలకుచెందిన టీడిపి నాయకులు దొంగఓట్లు వేస్తూ పట్టుబడ్డారన్నారు. పులివెందులలో ప్రజాస్వామ్యం వర్ధిల్లిందంటూ మంత్రి లోకేష్ చేసిన (తరువాయి 4లో...)




## గుర్తింపు కార్డులేక పోయిన ప్రతి మహిళ ఉచిత ప్రయాణానికి అర్హురాలే

### ఘాట్ రోడ్డులో కూడా టిక్కెట్ ఉచితం

### ఆర్టీసి ఆర్ఎం సత్యనారాయణ

## చిమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

### ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీమంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా పాండురంగరావు దంపతులు

### కుటుంబ సభ్యులతో కలసి ఉట్టి కొట్టిన మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా పాండురంగరావు దంపతులు



**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, ఆగస్టు 16)**

శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతుల ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. ఆలయంలో వేంచేసి ఉన్న సకల దేవతలకు శిద్దా రాఘవరావు దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి విశేష పూజలు నిర్వహించారు. శ్రీ కృష్ణ జన్మాష్టమి పునస్కరించుకొని శ్రీ హరిహర క్షేత్రాన్ని (తరువాయి 5లో...)

# పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు

ట్వీట్ వీడియోలోనే దొంగ ఓటర్లున్నారన్నారు. పోలింగ్ బూత్ను ఆక్రమించుకున్న మంత్రి రామప్రసాదొడ్డిపై ఇప్పటివరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఏజెంట్లనే కాక కనీసం వైయస్సార్సీపి తరుపున పోటీచేసిన అభ్యర్థులను కూడా ఓట్లను వేయనీకుండా తీవ్ర అక్రమాలకు పాల్పడి ఎన్నికల్లో గెలవడం సిగ్గుచేటని అన్నారు. ఎన్నికల నిర్వహణపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హైకోర్టును ఆశ్రయించిందని ఈ నేపథ్యంలో హడావుడిగా కూటమి ప్రభుత్వం ఓట్లలెక్కింపు కోసం ఎక్కువ టేబుళ్లను వేసి ఎన్నికల ఫలితాలను ప్రకటించడం విడ్డూరమన్నారు. దొంగ ఓటర్లతో వీడియో అప్లోడ్ చేశారని, కాదని చెప్పే ధైర్యం కూటమి నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. పులివెందులలో టీడిపికి 6,716, వైయస్సార్సీపికి 683 ఓట్లు వచ్చాయంటే రిగ్గింగ్ లెక్కలే చెబుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు నిజంగా అంతటి ప్రజాబలం ఉందని అనుకుంటే ఇన్ని అక్రమాలు చేయాల్సిన అవసరం ఎం వచ్చిందన్నారు. తమ అనైతిక అప్రజాస్వామిక విధానాలకు పోలీసు యంత్రాంగాన్ని కూటమి ప్రభుత్వం యదేశ్చగా వినియోగించుకుందన్నారు. ఈనెల 5న పులివెందులలో ప్రచారం కోసం వెళ్లిన ఎమ్మెల్సీ రమేష్యాదవ్, వైయస్సార్సీపి నాయకులు వేల్పుల రామూ పై దాడిచేసి హత్యచేయడానికి ప్రయత్నించారని, కారుపై పెట్రోల్ పోసి తగులబెట్టి భయభ్రాంతులకు గురిచేయలేదా అని ప్రశ్నించారు. ఈ దాడిలో గాయపడి చావుబతుకుల మధ్య ఉన్న రాము పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయలేదా అన్నారు. కర్నూల్ డిఐజి కోయ ప్రవీణ్ మరీ విడ్డూరంగా పక్కగ్రామంలో పత్తివ్యాపారం ఏంటని, ఇంకా మేం ఉండబట్టే తలలు పగిలాయి, లేదంటే తలలు తెగిపడేవి అని బాధ్యతారాహితంగా మాట్లాడటం ఐపిఎస్ అధికారికి తగదన్నారు. పులివెందులలో వైయస్సార్సీపి అభ్యర్థి తుమ్మల హేమంత్ రెడ్డిని కనీసం ఓటు వేయనీయలేదని, ఆరోజు తెల్లవారుజామున నుంచే హౌస్ అరెస్టు చేయడం జరిగిందన్నారు.


అధికారపక్ష అభ్యర్థిని మాత్రం స్వేచ్ఛగా వదిలేశారన్నారు. టీడిపిఅభ్యర్థి హంగు ఆర్భాటంగా అన్నీపోలింగ్బూత్లను రాజ్యాంగం తమకు మాత్రమే కల్పించిన హక్కు అన్నట్లుగా భావిస్తూ ఎన్నికలు జరిగిన అన్నీ ప్రాంతాలను చుట్టేశారన్నారు. కడప ఎంపి వైయస్ అవినాష్రెడ్డి స్థానికుడైనాతెల్లవారుఝామున నుంచే ఆయన ఇంటికి వెళ్లి కనీసం చెప్పులు కూడా వేసుకోనివ్వకుండా, ఆరోగ్యం బాగోలేదని చెబుతున్నా వినకుండా రెండు చేతులను పట్టుకుని లాక్కుని వచ్చారన్నారు. సదరు సంఘటనపై డిఐజి ప్రవీణ్ను విలేకరులు ప్రశ్నిస్తే ముందస్తు జాగ్రత్తగా ఆయనను అదుపులోనికి తీసుకున్నామని బీఎన్ఎస్ ఒక సెక్షన్ ప్రకారం ఆ పనిచేశామని అర్థంలేని మాటలతో సమాధానం చెప్పారన్నారు. పార్టీ కార్యకర్తల ఆందోళనలతో ఎంపీ అవినాష్రెడ్డిని విడిచిపెట్టినా, పులివెందులలోని పార్టీ కార్యాలయంలోనే ఉండాలని పోలీసులు ఆంక్షలు విధించారన్నారు.

పార్టీ కార్యాలయం వద్ద పోలీసులు చుట్టుముట్టి డిఐజి కోయ ప్రవీణ్ పార్టీ కార్యాలయంలోనే తిష్ఠ వేశారని ఎన్నికల నియమావళి ఉల్లంఘించారంటూ నోటీసులు ఇచ్చిన డిఐజి, ఎసిపి కూడా అక్కడే ఉన్నారన్నారు. పార్టీ కార్యకర్తలు పోలీసుల తీరును నిరసిస్తే నిప్పులు చెరిగిన డియస్పి మురళీ కాల్చిపరేస్తా.. నా కొడకల్లారా.. ఇక్కడ యూనిఫాం.. అంటూ బెదిరించారన్నారు. యూనిఫాం వేసుకున్న పోలీసులు ప్రజలను రక్షించడానికా..పాలకులు చెప్పింది చేయడానికా అని ప్రశ్నించారు. ఎక్కడెక్కడి నుంచో తరలివచ్చిన టీడిపి గూండాలకు పోలీసులు బాసటగా నిలిచారని, ఓట్లు వేసేందుకు బయలుదేరిన వైయస్సార్సీపి సానుభూతిపరులన అడ్డుకుని వారి స్లిప్పులు లాక్కున్నప్పుడు చూస్తున్న పోలీసులు మాత్రం నోరు మెదపలేదన్నారు. ఎన్నికల సందర్భముగా వైయస్సార్సిపికి చెందిన నాయకులు, కార్యకర్తలకువందల సంఖ్యలో బైండోవర్ చేసి పోలీసు స్టేషన్లో పెట్టారని మరోవైపు అధికారపక్షం వారికి రెక్కలు తొడిగాయని, దీంతో వారు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేస్తూ అ త్యంత దారుణంగా నిర్వహించిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటిసి ఉప ఎన్నికలను రద్దుచేసి కేంద్ర బలగాల ఆధ్వర్యంలో తిరిగి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం తమ ప్రతిష్ఠను కాపాడుకోవాలంటే ఈ ఎన్నికలను రద్దుచేయాలని, ఎన్నిక సందర్భములో అదికార పార్టీతో కుమ్మకైన తీరు, పోలీసు అధికారులు సహకరించిన తీరుపై విశితమైన దర్యాప్తు చేయాలని, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ ను సూపర్ సక్సెస్ చేసింది



ఈ
పాదయాత్ర











చేస్తామంటూ జగన్మోహన్ రెడ్డి ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు? ఆయన ప్రజలకు సమాధానం చెప్పాలి అని మంత్రి అన్నారు.

### రాష్ట్ర రహదారుల అభివృద్ధి గుంతల రహిత రహదారులు

రాష్ట్రంలోని రోడ్ల పరిస్థితిపై మాట్లాడుతూ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి "గతంలో ఆర్ అండ్ బి శాఖ పరిస్థితి దారుణంగా ఉండేది. పక్క రాష్ట్రాల వారు, నాయకులు కూడా మన రాష్ట్ర రోడ్లను చూసి జోక్ చేసుకునే స్థాయిలో ఉండేది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1080 కోట్లతో దాదాపు 20,000 కిలోమీటర్ల రహదారులను గుంతల రహితంగా మార్చాము. గతంలో యువగళం పాదయాత్ర సమయంలో కొండపి నియోజకవర్గంలో రోడ్ల దుస్థితిని నేను స్వయంగా చూశాను. ఇక భవిష్యత్తులో కొండపి నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తాను" అని స్పష్టం చేశారు.

### పార్టీలో విశ్వాసం ఉంచిన వారికి తగిన గుర్తింపు

పార్టీపై నమ్మకం ఉంచిన వారికి ఎప్పటికీ అన్యాయం జరగదని మంత్రి తెలిపారు. "తెలుగుదేశం పార్టీని నమ్ముకుని చిత్తశుద్ధితో పనిచేసే నాయకులకు తగిన గుర్తింపు తప్పనిసరిగా లభిస్తుంది. కర్ణ కోటిరెడ్డి, తిరుపతమ్మ దంపతులు అందుకు ప్రత్యక్ష నిదర్శనం" అని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు కొత్తగా ఎన్నికైన పాలక మండలి సభ్యులకు అభినందనలు తెలిపారు. పెద్ద ఎత్తున కూటమి కార్యకర్తలు హాజరై వాతావరణాన్ని ఉత్సాహభరితంగా మార్చారు. సింగరాయకొండలో నిర్వహించిన ఈ ప్రమాణ స్వీకార సభతో కొండపి నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఉత్సాహంగా మారింది.

# గుర్తింపు కార్డులేక పొయిన ప్రతి మహిళ ఉచిత ప్రయాణానికి అర్హురాలే

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 16)

గుర్తింపు కార్డు లేక పోయిన మహిళ అయితే ఉచిత బస్సు ప్రయాణానికి అర్హులే అని ఆర్టీసి ఆర్ఎం సత్యనారాయణ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్త్రీ శక్తి పథకం పేరుతో ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని శనివారం పొదిలి ఆర్టీసి డిపోలో పరిశీలించారు. అనంతరం ఉచిత బస్సు పథకం పై మహిళలతో ఆయన కాసేపు మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒక వారం రోజుల పాటు గుర్తింపు కార్డుల గురించి పెద్దగా పట్టించుకోమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తుందన్నారు. ఆర్టీసి బస్టాండ్లో మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి మహిళా



ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియెగం చేసుకొవాలని ఆయన కొరారు. శ్రీశైలం, నంద్యాల వంటి ఘాట్ రొడ్ లో ప్రయాణం చేసేటువంటి మహిళలకు కుడా ఉచిత ప్రయాణం వర్తిస్తుందని తెలిపారు. ముఖ్యంగా ఆర్టిసి బస్టాండ్లో మరుగుదొడ్లు, మంచినీరు వంటి వాటి పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన తెలిపారు. అనంతరం బస్సులలో ఎక్కి ప్రయాణికులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఉచిత ప్రయాణం పై మహిళలలు చాల సంతోషంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి డిఎం శంకర్రావు, సిఐ ధనలక్ష్మి, పలు యనియన్ నాయకులు, ఆర్టీసి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





# చిమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

సర్వాంగ సుందరంగా అలంకరించారు. శనివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా చీమకుర్తి నగరానికి చెందిన ఆర్యవైశ్య మహిళలు శ్రీ వాసవి కన్యాకా పరమేశ్వరి అమ్మవారికి సామూహిక శ్రీ లలితా సహస్ర నామ స్తోత్రం, హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శిద్దా రాఘవరావు దంపతులు శ్రీ కృష్ణ భగవానుడికి విశేష పూజలు నిర్వహించి గో మాతకు పూజలు నిర్వహించి స్వామి వారి ఆశిస్సులు అందుకున్నారు. శిద్దా రాఘవరావు దంపతులు శ్రీ కృష్ణునికి ప్రీతికరమైన వెన్నతో పాటుగా మధుర పదార్థాలు నైవేద్యం సమర్పించారు. అనంతరం ఉట్టి వేడుకలు కమణీయంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణతో ఏర్పాటు చేసిన ఉట్టి వేడుకల్లో శిద్దా రాఘవరావు దంపతులు పాల్గొన్నారు. అనంతరం శిద్దా వెంకటేశ్వర్లు వెంకట శ్రీమతి వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం అందజేశారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు శిద్దా రాఘవరావు దంపతులకు, కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వాదాలు నిర్వహించారు. ఈ వేడుకలలో చీమకుర్తికి చెందిన వాసవి యూత్ సభ్యులు, వాసవి మహిళలు పెద్ద ఎత్తున ఉట్టి సంబరాలలో పాల్గొన్నారు.





# నేడు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నూతన భవనం ప్రారంభం



భవనాన్ని ఆ సంస్థ వ్యవస్థాపకులు ఎన్ రామచంద్రారెడ్డి ప్రారంభించనున్నట్లు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతన భవనంతో పాటు భవనం వరకు నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డు, ఉచితంగా అందజేసి ఆంబులెన్స్, ఫ్రీజర్ బాక్సలను కూడా ఆయన ప్రారంభించనున్నారు. కావున ఈ కార్యక్రమానికి పొదిలి పట్టణంలోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, ప్రజలు భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సభ్యులు కోరారు.



# ఆపదలో ఉన్న వారికి అండగా సీఎం సహాయనిధి

### 34 మంది లబ్ధిదారులకు రూ.44.45 లక్షల చెక్కులు అందజేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు

**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఆగస్టు 16)**

ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయనిది అండగా నిలిచి ఆదుకుంటుందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 34 మంది లబ్ధిదారులకు ? 44,45,104 సీఎం సహాయనిధి చెక్కులను శనివారం సాయంత్రం చీఫ్ విప్ కార్యాలయంలో జీవి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో అండగా నిలుస్తుంది అన్నారు. పార్టీలకతీతంగా కేవలం అర్హత ప్రామాణికంగా ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరు కూడా ఇబ్బందులు పడకూడదని ఉద్దేశంతోనే సీఎం చంద్రబాబు నాయుడు గారు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని స్పష్టం చేశారు. వైద్య పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న సీఎం సహాయ నిధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య సహాయం కోసం సీఎం సహాయ నిధులు మంజూరు చేయించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.







# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కందుల

**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఆగస్టు 16)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నియోజకవర్గంలోని పలు శుభకార్యాలకు హాజరయ్యారు. అందులో భాగంగా తర్లుపాడు మండల కేంద్రంలో ఈర్ల వారి వివాహ సందర్భంగా విచ్చేసి నూతన వధువును ఆయన ఆశీర్వదించారు

# సర్దార్ గౌతు లచ్చన్న సేవలు మరువలేనివి





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఆగస్టు 16)**

సర్దార్ గౌతు లచ్చన్న సేవలు మరువలేనివని, వారి పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు వెళ్లాలని ఇన్చార్జ్ సంయుక్త కలెక్టర్ జి గంగాధర్ గౌడ్ అన్నారు. శనివారం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా బాపట్ల చీల్ రోడ్ లోని ఆయన విగ్రహానికి ఇన్చార్జి సంయుక్త కలెక్టర్ జి గంగాధర్ గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు, కూలీల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గౌతు లచ్చన్న సేవలు అపూర్వమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం కోసం అనేక కష్టాలు, జైలు జీవితం గడిపిన ఆయన నేటి తరానికి స్ఫూర్తిదాయకుడని అన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి తన రాజకీయ జీవితాన్ని అంకితం చేసిన ప్రజానాయకుడని ఆయన గుర్తుచేశారు. సర్దార్ గౌతు లచ్చన్న స్వాతంత్ర్యం సాధనలో చేసిన కృషికి గాను వారి జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన తెలిపారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చి ప్రజల కోసం అహర్నిశలు పోరాడిన లచ్చన్న నిజాయితీ, ధైర్యం, త్యాగం ప్రతి యువకుడికి ఆదర్శమని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి తన రాజకీయ జీవితాన్ని అంకితం చేసిన ప్రజానాయకుడని గుర్తుచేశారు. బాపట్ల ఆర్డీవో గ్లోరియ మాట్లాడుతూ గౌతు లచ్చన్న స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని, సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బౌడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, బీసీ సంక్షేమ శాఖ అధికారి శివలీల, డీపీవో ప్రభాకర్, డిఆర్డిఏ పీడీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంకొండ కళాశాలలో కృష్ణాష్టమి వేడుకలు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 16)**



కృష్ణాష్టమి సందర్భంగా మండలంలోని కంభాలపాడులో గల బెల్లంకొండ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించి, కోలాట ప్రదర్శనలు, ఉట్టి కొట్టే కార్యక్రమం, ఆటపాటలతో వేదికను సందడి చేశారు. ఈ సందర్భంగా కాలేజీ డైరెక్టర్ బెల్లంకొండ విజయలక్ష్మి గారు కృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించి, ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆమె స్వయంగా కూడా ఉట్టి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో కలిసి ఆటపాటలలో తళుక్కుమన్నారు. పండుగ వాతావరణంలో కళాశాల అంతటా ఆనందం అలరారింది. ఉట్టి కొట్టి విజయం సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసి వారిని ప్రోత్సహించారు. కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బెల్లంకొండ శ్రీనివాసరావు విద్యార్థులను అభినందిస్తూ, ఇటువంటి సాంప్రదాయ ఉత్సవాలు మన సంస్కృతిని మరింత బలపరుస్తాయని తెలిపారు. బెల్లంకొండ కాలేజీ ఆవరణలో జరిగిన ఈ కృష్ణాష్టమి వేడుకలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులందరిని ఆకట్టుకున్నాయి.

# శ్రీగిరిలో భక్తిశ్రద్ధలతో గోపూజ
# శ్రీవారికి 21 రకాల ప్రసాదాల నివేదన



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 16)

గో కులాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సివి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి, ఆలూరు కుమార ఆత్రేయ, ఆలూరు ఫణి కుమార్, డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, ఆలూరు జై శంకర్‌ల ఆధ్వర్యంలో గోపూజ కార్యక్రమంతో పాటు యాదవ రాజుల సన్మాన కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు గో పూజలో పాల్గొన్నారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో యాదవ రాజులతో పాటు సన్నిధి గొల్లలను నూతన వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. శ్రీవారికి 21రకాల ప్రసాదాలను, పండ్లను నివేదన చేసారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేసారు.

## యాదవరాజులకు సన్మానం



**17 నుండి బాల బాలికలకు శిక్షణా తరగతులు:**

శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, చిన్మయ బాల విహార్ సంయుక్త నిర్వహణలో శ్రీగిరి గో క్షేత్ర భవనంలో ప్రతి ఆదివారం ఉదయం 9.30 నుండి 11 గంటల వరకు చిన్మయ మిషన్ కు చెందిన బ్రహ్మచారి హరీష్ చైతన్య చే ఆధ్యాత్మిక శిక్షణా తరగతులు జరుగుతాయని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు తెలిపారు. 5 నుండి 17 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారు ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**22 న సామూహిక సువాసినీ పూజ**

ఈ నెల 22 వ తేదీ ఉదయం 9 గంటలకు శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కల్యాణ మండపంలో మహిళలతో సామూహిక సువాసినీ పూజ (వరలక్ష్మి వ్రతం) నిర్వహిస్తున్నట్లు దేవస్థానం నిర్వాహకులు పేర్కొన్నారు. మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి అనుగ్ర హానికి పాత్రులు కావాలని కోరారు. సామూహిక సువాసినీ పూజలో పాల్గొన దలచిన మహిళలు పూర్తి వివరాలకు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

# సుబ్రమణ్య స్వామి వేల్ కావడి మహోత్సవం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 16)

ఆడి కృతిక పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఒంగోలు నగరంలో సుబ్రమణ్యస్వామి వేల్ కావడి మహోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు. సుబ్రమణ్య స్వామి మాలధారణ చేసిన భక్తులు కావడి ధరించి కేశవస్వామి పేటలోని శివాలయానికి వచ్చి పూజలు నిర్వహించి సుబ్రహ్మణ్య స్వామి ఆయుధం అయిన వేలాయుధాన్ని శరీరానికి గుచ్చుకుని మేళతాళాలతో నృత్యాలు చేస్తూ పట్టణంలోని గాంధీ రోడ్డు, కోర్టు సెంటర్ మీదుగా శ్రీగిరిపై ఉన్న స్కందగిరి సుబ్రహ్మణ్యస్వామి దేవాలయానికి చేరుకున్నారు. మేళతాళాలు...తీన్ మార్ డప్పులతో నిర్వహించిన వేల్ కావడి మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేల్ కావడి ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి తిరున్వేలి కన్నయాచారి మాట్లాడుతూ, గత 60 సంవత్సరాలుగా ఒంగోలు నగరంలో ఆడి కృతిక సందర్భంగా వేల్ కావడి మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని ఎక్కువగా తమిళనాడు సమీపంలో ఊర్లలో మాత్రమే జరుపుతారని అయితే గత మూడు వందల ఏళ్లుగా ఒంగోలులో తమిళనాడు నుంచి వలస వచ్చి స్థిరపడిన తమిళులు ఈ పండుగను ఒంగోలు నగరంలో ఘనంగా నిర్వహిస్తున్నారని, నగరోత్సవంగా కావడి ధరించి, సూలాయుధం శరీరానికి గుచ్చుకుని భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొఠారి నాగేశ్వరరావు, పప్పు శ్రీనివాసరావు, తిప్పరపల్లి రవితేజ, అజయ్ కుమార్, తదితరులు ఉన్నారు.







# వైసీపీ యూత్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా గాయం శ్రీనివాసరెడ్డి

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఆగస్టు 16)



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా గాయం శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుండి శనివారం అధికారికంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈయన పార్టీ ఆవిర్భావం నుండి అదే పార్టీలో కొనసాగుతూ ఉన్నారు. ఈయన స్వస్థలం తర్లుపాడు మండలం పోతలపాడు గ్రామం. ఈ సందర్భంగా గాయం మాట్లాడుతూ యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా తనపై ఎంతో నమ్మకంతో నియమించిన పార్టీ జాతీయ అధ్యక్షులు వైయస్సార్ జగన్ మోహన్‌రెడ్డి, నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి అన్నా రాంబాబు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదేశానుసారం పార్టీ అభివృద్ధి కోసం శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు. గత 16 మాసాల ఎన్‌డిఏ పాలన పై రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర స్థాయిలో అసంతృప్తి నెలకొందన్నారు. ఎన్నికల ముందు ఒక మాట, అనంతరం ఒక మాట మాట్లాడడం చంద్రబాబుకు మొట్ట మొదటి నుండి ఉన్న అలవాటేనని అన్నారు. గత ఐదు సంవత్సరాల వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఒక వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి పెద్ద ఎత్తున జరిగిందన్నారు. నాటి వైసిపి ప్రభుత్వం అమలు పరచిన అనేక పథకాలను ప్రజలలోకి తీసుకపోకపోవడం వల్లనే గత ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలైందని ఆయన గుర్తించారు. రాష్ట్ర ప్రజలు తిరిగి జగన్ ముఖ్యమంత్రిగా కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన అన్నారు.

## జాతీయ కరాటే ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీల ఏర్పాట్లు పరిశీలన

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 16)







ఒంగోలు మినీ స్టేడియంలో సిద్దార్ధ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో జరిగే జాతీయ కరాటే ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీల ఏర్పాట్లను శనివారం సాయంత్రం సిద్దార్ధ కరాటే అకాడమీ అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ పరిశీలించారు. ఆయన వెంట టోర్నమెంట్ ఆర్గనైజర్ నల్లూరి మోహన రావు, సిద్దార్ధ కరాటే అకాడమీ ప్రధానకార్యదర్శి మండవ సుబ్బారావు, నంబూరి శ్రీరాములు ఉన్నారు, ఈ పోటీలను 17వ తేదీ ముఖ్య అతిథులు ప్రారంభించనున్నారు.

## మంత్రి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న మేడా రామశేఖర్



(షణ్ముఖ వెలుగు, మచిలీపట్నం, ఆగస్టు 16)

79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పశుసంవర్ధక శాఖలో విశిష్ట సేవలు అందించిన స్వర్గీయ మేడా రామకోటేశ్వరరావు కుమారుడు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరక్టర్ మేడా రామ శేఖర్ ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదుగా ఆయనకు అందుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, పొదిలి పట్టణ ప్రజలు, బంధుమిత్రులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## మహిళా సాధికారితే ధ్యేయం

మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఆగస్టు 16)

మహిళల సాధికారతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఉద్ఘాటించారు. శనివారం పట్టణంలో ఓ కళ్యాణ మండపంలో పూజిత మహిళా సోసైటీ ద్వారా శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు, బ్యూటిషియన్ కిట్లు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే జూలకంటి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. శిక్షణలో ఎంపిక చేసిన మహిళలకు, యువతులకు సంస్థ ద్వారా ఉచితంగా అందించే కుట్టు మిషన్ లను, బ్యూటిషియన్ కిట్లను ఆయన చేతులమీదిగా అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్రంలో అతివల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా సంక్షేమమం కోసం పెద్దపీఠ వేస్తున్నారని ఆయన వెల్లడించారు. మహిళ ఆర్థిక స్వావలంబనకు పాటుపడుతున్న పూజిత మహిళా సోసైటీ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పూజిత మహిళా సోసైటీ అధ్యక్షురాలు కోటేశ్వరి, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించిన ప్రకాశం పోలీసులు

## ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో భాగస్వాములు









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 16)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన “స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర” కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లా పోలీసులు శనివారం (ప్రతి నెల మూడవ శనివారం) ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు, సిబ్బంది కలసి జిల్లా పోలీసు కార్యాలయం సహా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల కార్యక్రమం ప్రధానంగా వర్షాకాలంలో వరదలు, అంటువ్యాధుల నివారణపై దృష్టిసారించింది. జిల్లా పోలీసు కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లు, వాటి పరిధిలోని పలు ప్రదేశాల పరిసరాలను శుభ్రం చేశారు. నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి, దోమలు, ఇతర క్రిములు పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. మురుగునీటి పారుదల కాలువలను శుభ్రం చేసి, రసాయన ద్రావణాలను పిచికారీ చేశారు. వర్షాకాలంలో అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, తాగునీటిని శుభ్రంగా ఉంచుకోవడం, ఆహార పదార్థాలను మూసి ఉంచడం, చేతులను శుభ్రంగా కడుక్కోవడం వంటి ప్రాథమిక ఆరోగ్య నియమాలను అధికారులు ప్రజలకు వివరించారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. సమాజంలో శాంతియుత వాతావరణం, పరిశుభ్రమైన వాతావరణం రెండూ సమానంగా ముఖ్యమైనవని భావించిన పోలీస్ అధికారులు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తూ, స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో పోలీసులు తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తారు.



# తప్పిపోయిన బాలుడిని 2 గంటలలో వ్యవధిలోనే గుర్తించిన పోలీసులు

## అనంతరం తల్లిదండ్రులకు అప్పగింత




(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఆగస్టు 16)

తప్పిపోయిన బాలుడిని 2 గంటల్లోనే వెలిగండ్ల ఎస్ఐ కృష్ణపావని తల్లిదండ్రుల వద్దకు చేర్చింది. వివరాల్లోకి వెళితే శనివారం మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో డయల్ 100 కాల్ పరిశీలించగా మరపగుంట్ల గ్రామ ఎస్సీ కాలానికి చెందిన చంద్రపాటి ఇస్మాయిల్ తన 11 సంవత్సరాల కుమారుడు చంద్రపాటి రామ్ కుమార్‌ని మందలించగా, అంతట రామ్ కుమార్ భయపడి ఇంటి నుండి వెళ్ళిపోయాడని, ఎంత వెతికినా కనిపించలేదని ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదు మేరకు వెలిగండ్ల ఎస్ఐ కృష్ణ పావని ఉన్నతాధికారులకు తెలియపరిచి కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ సూచనల మేరకు పామూరు సీఐ భీమా నాయక్ ఆధ్వర్యంలో వెలిగండ్ల ఎస్ఐ తన సిబ్బంది హుటాహుటిన మరపగుంట్ల గ్రామానికి చేరుకుని అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్ కెమెరాలను ఉపయోగించి చెట్ల చాటున దాక్కున్న బాలుడిని గుర్తించి సురక్షితంగా రామ్ కుమార్ ని వారి తల్లితండ్రులకు అప్పగించారు. బాలుడి ఆచూకీ కనుగొనుటలో త్వరితగతిన స్పందించి సురక్షితంగా రక్షించిన తల్లిదండ్రులు జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులకు రామ్ కుమార్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. బాలుడిని గుర్తించుటలో అత్యంత ప్రతిభ కనపరచిన కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, పామూరు సీఐ భీమా నాయక్, వెలిగండ్ల ఎస్ఐ కృష్ణపావని, వారి సిబ్బందిని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

# శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఎమ్మెల్యే ఇంటూరి





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 16)

వలేటివారిపాలెం మండలంలో వెలసియున్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారిని శనివారం ఉదయం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం ఆలయ అధికారులు ఎమ్మెల్యేకి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు వేద పండితులు, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి అన్నదాన ప్రసాద భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నాయకులు ప్రగడ శ్రీనివాసులు, చుండి అక్కయ్య, కాకుమాని హర్ష, శనివారపు మాల్యాద్రి, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# న్యాయస్థానాలలో ఉద్యోగాల నియామకానికి పరీక్షలు

## 20 నుండి 24వ తేదీ వరకు నిర్వహణ

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 16)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు వారి ఆదేశాల ప్రకారం న్యాయస్థానాలలో ఉద్యోగాల నియామకం కోసం వివిధ జిల్లాల్లో నిర్వహిస్తున్న పరీక్షలలో భాగంగా ప్రకాశం జిల్లాలో కూడా ఆగస్టు 20వ తేదీ నుండి 24వ తేదీ వరకు స్టెనోగ్రాఫర్లు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎగ్జామినర్లు, కాపీస్టులు, డ్రైవర్లు, రికార్డ్ అసిస్టెంట్లు, ప్రాసెస్ సర్వర్‌లు, అటెండర్లు యొక్క నియామకం కోసం కంప్యూటర్ ఆధార పరీక్షలు నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి అన్నారు. ఈ పరీక్షలు ఆగస్టు 20 నుండి 24వ తేదీ వరకు రోజుకు మూడు షిఫ్టులలో నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చ్ సొసైటీ యాక్షన్ ఇండియా మామిడిపాలెం, ఒంగోలు, బ్రిలియంట్ కంప్యూటర్స్, కె.బి రెస్టారెంట్ ఎదురు, నెల్లూరు బస్టాండ్, ఒంగోలు, రైస్ కృష్ణ సాయి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూట్ , వల్లూరు, ఒంగోలు కృష్ణ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్, మార్కాపురం, డాక్టర్ సామ్యూల్ జార్జ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్, మార్కాపూర్ నందు నిర్వహించబడతాయన్నారు. హాల్ టికెట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు అధికారిక వెబ్ సైట్ నుండి డౌన్లోడ్ చేసుకొని రిపోర్టింగ్ సమయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. అదే విధంగా ప్రతి ఒక్క అభ్యర్థి ఈ క్రింది విషయాలను గుర్తుంచుకోవాలని తెలిపారు. నియామకాలు పూర్తిగా గౌరవ హైకోర్టు వారి ఆదేశాల ప్రకారం, నియామక పరీక్షలు కేవలం ప్రతిభ ఆధారంగా, ఎటువంటి అవినీతికి అవకాశం లేకుండా, ఎటువంటి పైరవీలకి తావు లేకుండా నిష్పక్షపాతంగా నిర్వహించడం జరుగుతుందని అభ్యర్థులు ఎటువంటి పుకార్లను, మధ్యవర్తులను నమ్మవద్దని అన్నారు.

# కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి సేవల పై ఎమ్మెల్యే ఉగ్రకు ఒంగోలు రిమ్స్ ఆసుపత్రి హెడ్ నర్స్ కృతజ్ఞతలు

## రూ.10 వేల చెక్కు విరాళం

### ఆసుపత్రి సిబ్బందిని అభినందించిన ఎమ్మెల్యే ఉగ్ర



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఆగస్టు 16)**

ఒంగోలు రిమ్స్ (సర్వ జన ప్రభుత్వ వైద్యశాల)లో పనిచేస్తున్న హెడ్ నర్స్ జి. ఎస్తేర్ రాణి తన కూతురు ప్రిన్సి ప్రసవం కనిగిరి కమ్యూనిటీ వైద్యశాలలో చేయించగా, పండంటి బిడ్డ జన్మించాడు. కనిగిరి కమ్యూనిటీ వైద్యశాలలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కృషితో అభివృద్ధి చేసిన ఆధునిక వసతులు, మెరుగైన చైల్డ్ కేర్ విభాగంలో అందుతున్న నాణ్యమైన వైద్య సేవలు చూసి సంతోషించిన ఆమె, ఆసుపత్రికి రూ.10,000ల చెక్కును విరాళంగా అందజేశారు. హెడ్ నర్స్ జి ఎస్తేర్ రాణి గతంలో కనిగిరి కమ్యూనిటీ వైద్యశాలలో నర్స్ గా పని చేశానని గుర్తు చేశారు. చైల్డ్ కేర్ విభాగం లో అధునాతనమైన పరికరాలతో నాణ్యమైన సేవలు అందించడంపై కృషిచేసిన ఎమ్మెల్యే ఉగ్ర కు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే ఉగ్రకు చెక్కును అందజేసిన ఎస్తేర్ రాణి, తన కూతురు సురక్షితంగా ప్రసవం జరగడంతో పాటు ఆసుపత్రి సిబ్బంది చూపిన శ్రద్ధకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో మరింత మెరుగైన వసతులు, నాణ్యమైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్నాం. ప్రసవాలు ఇక్కడే పెరగాలి. వైద్య సిబ్బంది మరింత సమర్థవంతంగా పనిచేయాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చన్నా కోమలిదేవి, బుల్లా బాలబాబు, ఖాజా రహిమాన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్బయ్య, ఇతర వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.



# జీజీహెచ్‌లో తొలిసారిగా హిస్టీరోస్కోపీ పరీక్షలు

## జిజిహెచ్ సూపరెంటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు, గైనిక్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ సంధ్యా రాణి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 16)**

జీజీహెచ్‌లో తొలిసారిగా హిస్టీరోస్కోపీ పరీక్షలు తొలిసారిగా అందుబాటులోకి వచ్చాయని జిజిహెచ్‌లో గైనిక్ విభాగంలో వైద్యులు ఈ ఘనత సాధించినట్టు జిజిహెచ్ సూపరెంటెండెంట్ డాక్టర్ మాణిక్య రావు, గైనిక్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ సంధ్యా రాణి తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ విషయాలను వెల్లడించారు. పెద్ద నగరాలు, లేదా అత్యాధునిక పరికరాలు అందుబాటులో వుండే ప్రదేశాల్లో మాత్రమే ఈ హిస్టీరోస్కోపీ పరీక్షలు జరుగుతున్నాయని అన్నారు. ఇప్పుడు జి జి హెచ్ లో వచ్చిన ఈ పరికరం మహిళలకు వరం లాంటిదన్నారు. ఈ సందర్భంగా సూపరింటిండెంట్ హైస్టెరోస్కోపీ గురించి వివరాలు వెల్లడించారు. హిస్టీరోస్కోపీ అనేది ఒక ప్రత్యేకమైన పరీక్ష, చికిత్స పద్ధతి. దీనిలో హిస్టీరోస్కోప్ అని పిలిచే చిన్న కెమెరా లాంటి పరికరాన్ని గర్భాశయంలోకి ప్రవేశపెట్టి, గర్భాశయాన్ని లోపల నుంచి స్పష్టంగా చూసే అవకాశం ఉంటుందన్నారు. నెలసరి ఎక్కువగా రావడం, ఎక్కువ రోజులు కొనసాగడం లేదా మధ్యలో రక్తస్రావం వంటి సమస్యలను గుర్తించడానికి, గర్భధారణ రాకపోవడానికి గాని, వరుసగా గర్భస్రావం కావడానికి గాని కారణాలను తెలుసుకోవడంలో సహాయపడుతుందన్నారు. అంతేగాక గర్భాశయంలో ఉండే చిన్న మాంసపు గడ్డలు, ముడులు లేదా అవరోధాలను గుర్తించి తొలగించడానికి, జన్యుపరమైన లోపాలు ఉన్నప్పుడు వాటిని సరిచేయడానికి. తప్పిపోయిన లేదా సరిగా లేకపోయిన ఐయుడీ స్థానాన్ని తెలుసుకోవడానికి ఒకేసారి పరిశీలనతో పాటు చికిత్స చేయగల పద్ధతి అంటే సమస్య ఏదైనా కనిపిస్తే, వెంటనే చిన్న పరికరాల సాయంతో తొలగించవచ్చని తెలిపారు. ఈ పరీక్షలకు కత్తిపోటు అవసరం లేదని పేర్కొన్నారు. ఒకేసారి పరీక్షా చికిత్స సాధ్యం అవుతుందన్నారు. పరీక్ష జరిగిన రోజే పేషంట్ ఇంటికి వెళ్లిపోవచ్చు అని తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు అభినందనలు తెలిపారు.

# గంటలోనే తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ప్రకాశం జిల్లా పోలీసులు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 16)**

ఒంగోలు విజయనగర కాలనీకి చెందిన అన్నంపల్లి గురవయ్య కుటుంబ సభ్యులతో కలిసి ఒంగోలు అన్నవరపాడులోని ఓ వివాహానికి హాజరయ్యారు. అనంతరం ఆటోలో ప్రయాణించి ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సు ఎక్కించేందుకు వచ్చారు. బంధువులను బస్సులో ఎక్కించిన అనంతరం తిరిగి వస్తుండగా, గురవయ్య తన ఐదు సంవత్సరాల కుమారుడు అన్నంపల్లి తేజస్ చెయ్యి పట్టుకొని తీసుకువస్తున్నారు. అదే సమయంలో బాలుడు చెయ్యి వదిలి, తల్లిదండ్రులు చూసేలోపు బస్సుల మధ్యలో నుంచి వెళ్లిపోయాడు. తల్లిదండ్రులు ఒకవైపు, బాలుడు మరోవైపు వెళ్లడంతో పిల్లవాడు కనిపించకుండా పోయాడు. ఈ సమాచారాన్ని డయల్ 112 తెలియజేశారు. డయల్ 112 పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది వెంటనే స్పందించి తక్షణమే ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌కు మరియు ట్రాఫిక్ పోలీసులకు తెలియజేశారు. వెంటనే స్పందించిన తాలూకా సీఐ విజయ్ కృష్ణ, ట్రాఫిక్ ఎస్ఐ మాలాద్రి, ఏఎస్ఐ హనుమంతరావు మరియు పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడి సీసీ



కెమెరాలను పరిశీలించగా బాలుడు బస్సుల మధ్యలో నుండి వెళ్లినట్టు గుర్తించారు. ట్రాఫిక్ ద్విచక్ర వాహనాల పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ద్వారా సమాచారానికి తెలియజేస్తూ చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతకటం ప్రారంభించి, లక్కీ షాపింగ్ మాల్ ఎదురు ఉన్న సోనీ షాప్ వద్ద బాలుడిని గుర్తించారు. కేవలం ఒక గంటలోనే బాలుడిని గుర్తించి, తల్లిదండ్రుల చెంతకు సురక్షితంగా అప్పగించారు. తమ బాబును క్షేమంగా తమ వద్దకు చేర్చిన పోలీసు అధికారులకు బాలుడి తల్లిదండ్రులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తప్పిపోయిన బాలుడిని త్వరగా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన తాలూకా సీఐ విజయ్ కృష్ణ, ట్రాఫిక్ ఆర్ ఎస్ఐ మాలాద్రి, ఏఎస్ఐ హనుమంతరావు, కానిస్టేబుల్ జాబీర్‌లను జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

# అఖిల భారత యాదవ మహా సంఘం ఆధ్వర్యంలో ఉట్ల పండుగ ఉత్సవాలు



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఆగస్టు 16)**

శ్రీ కృష్ణాష్టమి పండుగ సందర్భంగా మార్కాపురం నెహ్రూ బజార్ షిరిడి సాయిబాబా మందిరంలో అఖిల భారత యాదవ మహా సంఘం వారి ఆధ్వర్యంల ఉట్ల పండుగ ఉత్సవాలు నిర్వహించారు. గత 27 సంవత్సరాలుగా యాదవ సంఘం ప్రముఖులు, శ్రీశైలం యాదవ సత్ర మాజీ అధ్యక్షులు పిన్నిక గంగయ్యకి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ కృష్ణాష్టమి వేడుకలలో మార్కాపురం పట్టణంలోని యాదవ సంఘం శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. నేటి కృష్ణాష్టమి వేడుకల్లో కాటంరాజు దేవస్థాన కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీ చిన్న వెంకటేశ్వర్లు యాదవ్ డివిజన్ యాదవ, సంఘం ప్రముఖులు బత్తుల పెద్ద అల్లూరయ్య యాదవ్,యువత అధ్యక్షులు పిన్నిక శివకుమార్ యాదవ్, నాగం వెంకటేష్ యాదవ్ గోసు అమర్నాథ్ యాదవ్ రమేష్ యాదవ్ బోసు శశాంక్ యాదవ్ లతోపాటు ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు. ఉత్సవంలో పాల్గొన్న ప్రథమ బహుమతి సాధకులు పిన్నిగా శివకుమార్ యాదవ్ కు 750 రూపాయలు, ద్వితీయ బహుమతి 500 రూపాయలు , ఆలయ కమిటీ సభ్యుడు, 300 రూపాయలు మూడో బహుమతిగా, కన్సోలేషన్ బహుమతిగా వంద రూపాయలు ఇద్దరు యాదవ యువకులకు అందించారు.

# ణజూతీసీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఆగస్టు 16)**

నియోజకవర్గంలోని 46 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి శనివారం తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 46 మందికి రూ.67,65,252ల చెక్కులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద ప్రజల పక్షాన నిలుస్తుందన్నారు. ఆరోగ్యం బాగలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com